క్లుప్తంగా

నాటా మహాసభలకు చక్రవర్తిరెడ్డికి ఆహ్వానం



తిరుపతి కల్చరల్: అమెరికన్ తెలుగు అసోసియేషన్స్ ఆధ్వర్యంలో ఈ నెల 30, జూలై 1, 2 తేదీల్లో అమెరికాలోని డల్లాస్‌లో నిర్వహించనున్న నాటా మహాసభలకు ఎస్‌డీహెచ్ఆర్ అధినేత డీవీఎస్.చక్రవర్తిరెడ్డిని నాటా అసోసియేషన్ ఆహ్వానించింది. ఈ సభలో ఆయన ఏపీలో విద్యా సంస్కరణలు, నూతన విద్యా విధానం గురించి ప్రసంగిస్తారు.

పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ వితరణ



భాకరాపేట: చిన్నగొట్టిగల్లు ప్రాథమిక పాఠశాలకు ఎన్నారై హరినాథ్ కంప్యూటర్, ప్రింటర్, పిల్లలకు నోటు పుస్తకాలు, పెన్నులు వితరణ చేశారు. వాటిని శనివారం హరినాథ్ తల్లిదండ్రులు రవీంద్రనాథ్, లక్ష్మీరాజేశ్వరి అందజేశారు. వారు మాట్లాడుతూ తమ బిడ్డ చదివిన పాఠశాలకు తన వంతు సాయం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. ఎంఈవో గోపీనాథ్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఇర్షాద్, హెచ్ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు రెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో సౌకర్యాలు

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం అగరాల సమీపంలోని జగనన్న కాలనీలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని సర్పంచ్ అగరాల భాస్కర్ రెడ్డి తెలిపారు. ఆయన శనివారం అధికారులతో కలిసి కాలనీలో మౌలిక వసతుల కల్పనపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ కాలనీలో 205 ఇళ్ల నిర్మాణం జరుగుతోందని, రూ.5 లక్షలతో పైపులైను ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యుత్తు లైన్లను క్రమబద్ధీకరించి రెండు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ రూరల్ ఏఈ హరిప్రసాద్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో కరువు మాయం

తిరుమల: నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ పరిపాలనలో కరువు కనుమరుగైందని మంత్రి విశ్వరూప్ తెలిపారు. ఆయన శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది రుతుపవనాల రాక ఆలస్యమైనా వర్షాలు సమృద్ధిగా కురవాలని స్వామిని కోరుకున్నానన్నారు. పవన్ కల్యాణ్ సీఎం కావాలనేది ఆయన అభిమానుల కోరిక అని అన్నారు.

టీటీడీపై విమర్శలు సిగ్గుచేటు

చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ సిగ్గుచేటని ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసులు తెలిపారు. ఆయన శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు.

కల్యాణ వెంకన్న సాక్షాత్కార వైభవోత్సవాలు ప్రారంభం

చంద్రగిరి(తిరుపతి రూరల్): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సాలకట్ల సాక్షాత్కార వైభవోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం చేశారు. సాయంత్రం స్వామివారిని పెద్ద శేష వాహనంపై కొలువుదీర్చి తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ఆదివారం హనుమంత వాహనం, మూడో రోజు గరుడ వాహనంపై స్వామివారు విహరించనున్నారు.

29న బక్రీద్ ప్రార్థనలు

తిరుపతి కల్చరల్: బక్రీద్ సందర్భంగా ఈనెల 29న ఈద్గా మైదానంలో అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు చేపట్టనున్నట్టు తిరుపతి ఈద్గా కమిటీ అధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాషా తెలిపారు. ఆయన శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. గతంలో ఈద్గాలో బక్రీద్ ప్రార్థనలు చేసేందుకు వసతుల కోసం మూడేళ్లుగా ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తన సొంత నిధులను వెచ్చిస్తున్నారని వివరించారు. ఈ ఏడాది కూడా ఆయన సొంత నిధులతో పాటు మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో రూ.15 లక్షలు వెచ్చించి సుమారు 20 వేల మంది ప్రార్థనలు చేసుకునే సౌకర్యాలు కల్పిస్తున్నట్టు చెప్పారు.

నిందితుడికి రిమాండ్

తిరుపతి లీగల్: వేధింపుల కేసులో కర్ణాటక రాష్ట్రం బళ్లారి విజయనగర కాలనీకి చెందిన ఎస్.శివప్రసాద్‌కు జూలై 7 వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి ఐదవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి సరిత శనివారం ఉత్తర్వులిచ్చారు. తిరుపతి అక్కారంపల్లి రోడ్డులో ఉంటున్న ఏ.రేణుక ఇదివరలో బళ్లారిలో ఉండేవారు. ఆమె భర్త జి.లింగప్ప కేఎస్ఆర్‌టీసీ కంట్రోలర్‌గా పనిచేస్తూ 2019లో మృతిచెందాడు. దీంతో ఆమె, కుటుంబ సభ్యులు 2020లో తిరుపతికి మకాం మార్చారు. అతని స్నేహితుడు శివప్రసాద్ రేణుక ఇంటికి వచ్చిపోతూ కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆమెను పెళ్లి చేసుకున్నాడు. ఆమె ఆస్తులతోపాటు రూ.1.20 కోట్లను శివప్రసాద్ కాజేశాడు. అనంతరం ఆమెను వేధించసాగాడు. దీనిపై ఆమె తిరుపతి దిశ పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోలీసులు కేసు దర్యాప్తుచేసి శివప్రసాద్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

ప్రజలు అమృతం కురిపిస్తున్నారు

- ఎన్ని పార్టీలు కలిసొచ్చినా జగనన్నలా మేలు చేయలేరు
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి
- ప్రతి గడపలోనూ విశేష ఆదరణ



21వ డివిజన్‌లో ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ తదితరులు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై విషం చిమ్ముతుంటే.. రాష్ట్ర ప్రజలు మాత్రం జగనన్న చేసిన మేలును మరిచిపోలేమని అమృతం కురిపిస్తున్నారని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన శనివారం కార్పొరేటర్ వి.ఈశ్వరి, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పడమటి కుమార్‌తో కలిసి తిరుపతి 21వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారు ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని, పథకాలను వివరించారు. పలువురు మహిళలు మాట్లాడుతూ జగనన్న విద్యా దీవెన, అమ్మ ఒడి వంటి పథకాలతో తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించుకుంటున్నామని చెప్పారు. ఇన్ని సంక్షేమ పథకాలు గతంలో ఏ ప్రభుత్వంలోనూ పొందలేదని వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 14 ఏళ్లు సీఎంగా ఉండి ప్రజలు చిన్నపాటి మేలు కూడా చేయలేని చంద్రబాబు, రాజకీయ లక్ష్యం లేకుండా ఏది పడితే అది మాట్లాడే పవన్‌కళ్యాణ్‌తో పాటు మరిన్ని పార్టీలు కలిసొచ్చినా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి అందించినన్ని సంక్షేమ పథకాలు ఇవ్వలేరని తెలిపారు. లబ్ధిపొందినందునే ప్రజలు తమకు ప్రతి గడపలోనూ హారతులతో నీరాజనం పలుకుతున్నారని చెప్పారు. జగనన్న పేద విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు కింద అభివృద్ధి చేసి నాణ్యమైన విద్యను అందిస్తున్నారన్నారు. జగనన్న లాంటి నాయకుడిని వదులుకోవడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా లేరన్నారు. టౌన్ బ్యాంకు డైరెక్టర్లు మబ్బు నాదమునిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, మాకం చంద్రయ్య, నాయకులు తాలూరి ప్రసాద్, అనీల్, నాగరాజు, మనోహర్‌రెడ్డి, డిష్ చంద్ర, జీవన్, వెంకటేష్, నాదముని, వెంకటేష్, శ్యామల పాల్గొన్నారు.

ప్రజల రుణం తీర్చుకునేలా అభివృద్ధి



తిమ్మినాయుడుపాలెం మాస్టర్‌ప్లాన్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూమన

తిరుపతి తుడా: ప్రజల రుణం తీర్చుకోవడంతో పాటు తిరుపతి నగర సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా అభివృద్ధి ప్రాజెక్టులను చేపట్టినట్లు ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి పేర్కొన్నారు. ఆయన శనివారం డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డితో కలిసి తిమ్మినాయుడుపాలెం, హీరో హోండా షోరూమ్– పద్మావతిపురం, అక్కారంపల్లి మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ రోడ్లతో తిరుపతి దశ మారనుందన్నారు. నగరానికి కనెక్టివిటీ పెరగడం, నగరంపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గడమే కాకుండా సుమారు ఐదువేల ఎకరాల్లో నగరం విస్తరించనుందన్నారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ తాము అభివృద్ధిని మాటల్లో కాకుండా చేతల్లో చేసి చూపిస్తున్నట్లు చెప్పారు. సరైన రోడ్ల వ్యవస్థ లేకపోవడంతోనే తిరుపతి నగరం విస్తరించలేదని, అందువల్లే మాస్టర్ ప్లాన్ రోడ్లను ఏర్పాటుచేస్తున్నట్లు వివరించారు. దశాబ్దాలుగా రోడ్డులేక ఇబ్బందులు పడ్డామని, ఇప్పుడు రోడ్లు వేయడంతో చాలా సంతోషంగా ఉందని ప్రగతి నగర్, లెనిన్ కాలనీ పరిసర ప్రాంత వాసులు తెలిపారు. వారు ఎమ్మెల్యే భూమనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆదం రాధాకృష్ణారెడ్డి, అనిల్‌కుమార్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు వెంకట్రామిరెడ్డి, పాముల రమేష్‌రెడ్డి, ఆదం సుధాకర్, వెంకటేశ్వరరెడ్డి, సాయికృష్ణ, సోమశేఖర్ రెడ్డి, కుప్పయ్య, కాంట్రాక్టర్ జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

రక్తపరీక్షలతో ఆరోగ్య సంరక్షణ

తిరుపతి రూరల్: రక్త పరీక్షలతో ఆరోగ్య సంరక్షణ సాధ్యమని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి తెలిపారు. ఆయన శనివారం చంద్రగిరి మండలం చిన్నరామాపురం, కందులవారిపల్లి, ఎ.రంగంపేట, రామిరెడ్డి పల్లి, బందార్లపల్లి, కొటాల, పుల్లయ్యగారిపల్లిలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను పరిశీలించారు. వైద్య సేవలతోపాటు అల్పాహారం, భోజన సదుపాయాలపై అధికారులతో చర్చించారు. రక్త, గుండె పరీక్షలు చేయించుకోవాలని, తద్వారా ఏవైనా సమస్యలు ఉంటే తగిన వైద్యం చేయించుకోవచ్చని చెప్పారు. ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేసుకునేలా అవగాహన కల్పించాలని వలంటీర్లకు సూచించారు.

అర్హులకు పథకాలు అందజేయండి

పాకాల: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత వలంటీర్లదేనని ఎంపీడీవో ప్రభాకర్ తెలిపారు. ఆయన శనివారం ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డితో కలిసి జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుంచి 28 వరకు వలంటీర్లు ప్రతి గడపకూ వెళ్లి వారికి 11 సేవలను ఉచితంగా అందజేయాలన్నారు. తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఈఓపీఆర్డీ మాలతి, ఏవో పుష్పావతి, హార్టికల్చర్ అధికారిణి శైలజ పాల్గొన్నారు.

ఘనంగా మరీచి మహర్షి జయంతి

తిరుమల: తిరుమలలోని ఆస్థాన మండపంలో శనివారం మరీచి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా శ్రీ వైఖానస దివ్య సిద్ధాంత వివర్ధిని సభ అధ్యక్షుడు దీవి రాఘవ దీక్షితులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వైఖానస శాస్త్రానికి మూలపురుషుడైన విఖనస మహర్షి శిష్యుడు మరీచి మహర్షి విమానార్చన కల్పం అనే గ్రంథాన్ని రచించారని తెలిపారు. శ్రీవారి ఆలయంలో నిర్వహించే ఆరాధన, విధి విధానాలకు ఈ గ్రంథం ప్రామాణికమన్నారు. ఆదేవిధంగా ఈ గ్రంథంలో పేర్కొన్న విధంగానే శ్రీవారికి అష్టదళ పాదపద్మారాధన సేవ జరుగుతోందని చెప్పారు. విఖనస ట్రస్టు కార్యదర్శి గంజాం ప్రభాకరాచార్యులు, టీటీడీ ఆగమ సలహాదారు పి.సీతారామాచార్యులు, ఎస్వీ వేద వర్సిటీ సహాయ ఆచార్యులు టి.బ్రహ్మాచార్యులు, మణిదీప్ కుమార్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచండి

తిరుపతి తుడా: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత అధికారులను ఆదేశించారు. ఆమె శనివారం ఇళ్ల నిర్మాణాలపై హౌసింగ్, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఇళ్ల నిర్మాణాలు ఆలస్యం కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రతివారం నిర్వహించే రివ్యూలకు వస్తున్నారే తప్ప క్షేత్రస్థాయిలో పురోగతి కనిపించడం లేదని మండిపడ్డారు. పూర్తయిన ఇళ్లలో జూలైలో ప్రవేశాలకు సిద్ధం చేయాలని సూచించారు.

మత్తుతో జీవితాలు చిత్తు

చంద్రగిరి(తిరుపతి రూరల్): మత్తు పదార్థాలతో జీవితం నాశనం అవుతుందని, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చంద్రగిరి ఎస్ఈబీ సీఐ లీలారాణి తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా శనివారం చంద్రగిరిలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ డ్రగ్స్‌ను అరికట్టేందుకు పోలీస్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. డ్రగ్ విక్రయించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని, కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ర్యాలీలో ఎస్ఐ హిమబిందు, బాలురు, బాలికల జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఉమామహేశ్వరి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిస్సాన్ మ్యాగ్నెట్ జీరా కారు ఆవిష్కరణ



కారును ఆవిష్కరిస్తున్న భూమన్, రామచంద్రారెడ్డి, షోరూం ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: రేణిగుంట రోడ్డులోని నిస్సాన్ అధీకృత డీలర్ హిటాచ్ నిస్సాన్ షోరూంలో శనివారం మ్యాగ్నెట్ జీరా కారును విడుదల చేశారు. ఇందులో భూమన్, శ్రీసిటీ జనరల్ మేనేజర్ రామచంద్రారెడ్డి, హిటాచ్ మోటార్స్ డైరెక్టర్ హసీమారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మ్యాగ్నెట్ జీరా స్పెషల్ ఎడిషన్‌ను ఆవిష్కరించారు. హిటాచ్ మోటార్స్ మేనేజింగ్ డైరెక్టర్ జగన్నాథరెడ్డి మాట్లాడుతూ నిస్సాన్ మ్యాగ్నెట్ జీరా ఎడిషన్‌లో సరికొత్త 360 డిగ్రీల వ్యూ కెమెరా, 9 ఇంచెస్ టచ్ స్క్రీన్, రియర్ ఏసీ, టైర్ ప్రెజర్ మోనిటరింగ్ సెన్సార్స్, వైర్ లెస్ చార్జర్, మూన్ లైట్ అప్పీరియన్స్, జేబీఎల్ స్పీకర్స్ తదితర అత్యాధునిక ఫ్యూచర్స్ ఉన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అశీష్‌రెడ్డి, నిరంజన్, జనరల్ మేనేజర్ ఎస్‌వీఎస్.శాస్త్రి పాల్గొన్నారు.

వైశ్య యూత్ పరిషత్ మేధోమథన సదస్సు



నియామక పత్రాలతో వైశ్య యూత్ పరిషత్ సెంట్రల్, రాష్ట్ర కమిటీ నేతలు

తిరుపతి కల్చరల్: కపిలతీర్థం రోడ్డులోని ఆలిండియా బ్రాహ్మణ వైశ్య సత్రంలో శనివారం సౌత్ ఇండియా వైశ్య యూత్ పరిషత్ మేధోమథన సదస్సు నిర్వహించారు. పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు మురంశెట్టి రాములు శ్రీరామానుజ చిత్రం హీరో సాయి వెంకట్‌తో కలిసి సప్త సూత్రాలతో కూడిన బ్రోచర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాజకీయ చైతన్యం, దేహ రక్షణ, దేశరక్షణ, ధర్మరక్షణ, అమ్మ, ఆవు, అన్నం వంటి కార్యక్రమాల గురించి వివరించారు. సెంట్రల్ కమిటీ, రాష్ట్ర కమిటీ నేతలకు నియామక పత్రాలు అందజేశారు. వైశ్యలందరూ సంఘటిత శక్తిగా మారాలని పిలుపు నిచ్చారు. సౌత్ ఇండియా వైశ్య యూత్ పరిషత్ ప్రధాన కార్యదర్శి బచ్చు శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీదేవి, సెంట్రల్ కమిటీ పీఆర్‌వో తేజ, ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షుడు రాచపల్లి బాలాజీ, కార్యదర్శి పి.వికాస్, కోశాధికారి పి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్ 2కే23 చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతిలోని గిరిజన భవన్‌లో శనివారం 12వ జాతీయ తోంగ్–ఇల్–మూ–డో మార్షల్ ఆర్ట్స్ – 2కే23 చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీల్లో 13 రాష్ట్రాల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీటిని స్కై అండ్ స్నోబోర్డ్ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మహ్మద్ అర్షద్, రాష్ట్ర రోలర్ స్కై అసోసియేషన్ అధ్యక్షుడు సి.వెంకటప్రసాద్, చైర్మన్ ఎస్.విశ్వచందన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహ్మద్ అర్షద్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర గ్రాప్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సురేంద్రరెడ్డి, తిరుపతి ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆంజనేయులు నాయుడు, ఏపీటీడబ్ల్యూయర్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.రత్నప్రభ, రాష్ట్ర తోంగ్–ఇల్–మూ–డో అధ్యక్షుడు ఇందు, ప్రధాన కార్యదర్శి ఈ.మణికంఠన్ పాల్గొన్నారు.

ఉరివేసుకుని విద్యార్థి ఆత్మహత్య

రామచంద్రాపురం: సీరామాపురం పంచాయతీ కోదండరామాపురంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న నందకిశోర్(16) శుక్రవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అన్నమయ్య జిల్లా చిట్వేలి మండలం నేతివారిపల్లికి చెందిన శివయ్య కుమారుడు నందకిశోర్ వారం క్రితం కళాశాలలో చేరాడు. శుక్రవారం ఉరికి వేలాడుతూ ఉండడాన్ని వార్డెన్ గమనించాడు. సిబ్బంది సహాయంతో రుయాకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. ఎస్ఐ గిరిబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బ్యాగ్‌ల సరఫరాకు టెండర్లు

తిరుపతి అర్బన్: జిల్లాలోని 12 ఐసీడీఎస్ కార్యాలయాల పరిధిలో ఉన్న 2,492 అంగన్‌వాడీ కేంద్రాలకు గర్భిణులు, బాలింతలకు ఇచ్చేందుకు హోమ్ రేషన్ బ్యాగ్‌లు సరఫరా కోసం టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జేసీ, జిల్లా కొనుగోలు సంఘం చైర్మన్ డీకే బాలాజి పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు 30వ తేదీ మధ్యాహ్నం 1.30 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, అదే రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు కలెక్టరేట్‌లోని జేసీ కోర్టు హాల్‌లో టెండర్లు ఓపెన్ చేస్తామని తెలిపారు. వివరాలకు 6303671701లో సంప్రదించాలని తెలిపారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయండి

తిరుపతి కల్చరల్: భక్తులకు సౌకర్యంగా ఉండేలా టీటీడీ ఆలయాల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని జేఈవో వీరబ్రహ్మం అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం టీటీడీ స్థానికాలయాలు, బయటి ప్రాంతాల్లోని ఆలయాల అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తిరుమల తరహాలో భక్తుల కోసం యూపీఐ పేమెంట్స్‌ని ప్రోత్సహించాలని సూచించారు. డెప్యూటీ ఈవోలు గోవిందరాజన్, గుణభూషణ్‌రెడ్డి, విజయకుమార్, వరలక్ష్మి, శాంతి, దేవేంద్రబాబు, వెంకటయ్య, శివప్రసాద్ పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి ఘన స్వాగతం

తిరుపతి గాంధీ రోడ్: కేంద్ర సమాచార శాఖ మంత్రి దేవసింగ్ చౌహాన్‌కు శనివారం రాత్రి బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. నగరంలో ఆదివారం జరగనున్న పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మంత్రి వచ్చారు. ఆయనకు భానుప్రకాష్ రెడ్డి, గుండాల గోపీనాథ్ రెడ్డి, సామంచి శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం రెడ్డి, విజయ్ కుమార్‌రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం కేంద్ర మంత్రి పద్మావతి వసతి గృహంలో బస చేశారు.

డిపోల సిస్టమ్ సూపర్‌వైజర్లతో సమావేశం

తిరుపతి అర్బన్: జిల్లాలోని 11 ఆర్టీసీ డిపోల సిస్టమ్ సూపర్‌వైజర్లతో జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ యూటీఎస్ విధానం ద్వారా బస్సు ఎక్కడ ఉన్నాయి, వాటి పనితీరు తదతర వివరాలను తెలుసుకోవచ్చన్నారు. ఆర్టీసీ ఆదాయం పెంచే దిశగా చర్యలు చేపట్టాలని వివరించారు.

వడ్డీ లేకుండా ఆస్తి పన్నుల చెల్లింపు

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు 2023–24 మొదటి అర్ధ సంవత్సరంలో ఆస్తి పన్నులను వడ్డీ లేకుండా చెల్లించేందుకు ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చినట్లు కమిషనర్ హరిత తెలిపారు. ఈ నెల 30వ తేదీ లోపు వడ్డీ లేకుండా అసలు మాత్రమే చెల్లించవచ్చన్నారు. జూలై ఒకటి నుంచి పన్ను బకాయిలపై వందకు రెండు రూపాయల వంతున వడ్డీ చెల్లించాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఆదివారం కూడా పన్నులు చెల్లించేందుకు అవకాశం కల్పించినట్లు వెల్లడించారు.

రేపు నారావారిపల్లిలో ఉచిత వైద్య శిబిరం

చంద్రగిరి(తిరుపతి రూరల్): నారావారిపల్లి సచివాలయంలో సోమవారం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సహకారంతో వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రంగంపేట ఎంపీటీసీ, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు బోస్‌చంద్రారెడ్డి తెలిపారు. ఆయన శనివారం పంచాయతీ, సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. నారావారిపల్లి ఎంపీటీసీ రాజయ్య, ఉప సర్పంచ్ మానిష్‌రెడ్డి పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుకతో ఉజ్వల భవిష్యత్తు

చంద్రగిరి(తిరుపతి రూరల్): జగనన్న విద్యాకానుకతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తిరుపతి డీవైఈవో ఆనందరెడ్డి తెలిపారు. ఆయన శనివారం చంద్రగిరిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యా కానుక పంపిణీని తనిఖీ చేశారు. అనంతరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. ఎంఈఓలు లలితకుమారి, భాస్కర్‌బాబు, హెడ్మాస్టర్ విజయ పాల్గొన్నారు.

మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

తిరుపతి రూరల్: మహిళలకు జూలై 1 నుంచి 30 రోజులు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు చంద్రగిరిలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగి చిత్తూరు, తిరుపతి జిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 40 ఏళ్లలోపు ఉండి 10వ తరగతి చదివిన వారు అర్హులని, వివరాలకు 6301717672, 7989680587లో సంప్రదించాలన్నారు.

నేడు న్యాయశాఖ ఉద్యోగ సంఘం ఎన్నికలు

తిరుపతి లీగల్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ కోర్టుల్లో పనిచేస్తున్న నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ కార్యవర్గ సంఘం ఎన్నికలు ఆదివారం చిత్తూరు జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించనున్నారు. 540 మంది ఓటర్లు ఉన్నారు. న్యాయశాఖ ఉద్యోగులు శనివారం తిరుపతిలో ప్రచారం హోరెత్తించారు.

8వ వార్డులో రూ.60 లక్షలతో అభివృద్ధి పనులు



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: తిరుపతి నగరంలో వార్డుల అభివృద్ధే లక్ష్యంగా పనులు చేపట్టినట్టు డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం తిరుపతి 8వ డివిజన్ సుభాష్‌నగర్‌లో రూ.60 లక్షలతో అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో తిరుపతిని అత్యంత అద్భుతంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. 8వ డివిజన్‌లో రూ.60 లక్షలతో సీసీరోడ్లు, మురుగు కాలువల నిర్మాణంతోపాటు తాగునీటి బోర్లు వేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, కార్పొరేటర్ మునిరామిరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు మురళి, పార్టీ నాయకులు గఫూర్, నాదముని, అక్కినపల్లి లక్ష్మయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

తిరుపతి తుడా: తిరుపతి నగరం 44వ డివిజన్‌లోని సుందరయ్యనగర్, రైల్వే కాలనీలో సీసీ రోడ్లు, మురుగు కాలువ పనులను శనివారం డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నారాయణ, శ్రావణి, టౌన్ బ్యాంకు డైరెక్టర్ పోలిరెడ్డి నాగిరెడ్డి, నాయకులు నాదముని తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లోనూ ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించాలి



మాట్లాడుతున్న ఈఓ ధర్మారెడ్డి

తిరుమల: తిరుమలకు వెళ్లే ఆర్టీసీ బస్సుల్లోనూ గార్బేజ్ బ్యాగులు ఏర్పాటుచేసి ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించాలని టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం తిరుపతిలోని పద్మావతి విశ్రాంతి గృహంలో శనివారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ ఘాట్ రోడ్లు, నడకదారుల్లో రోడ్డుకు ఇరువైపులా ప్లాస్టిక్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. తిరుపతిలో రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద ఆగిన శ్రీనివాస సేతు నిర్మాణ పనులను పూర్తి చేయాలని చీఫ్ ఇంజినీర్‌ను ఆదేశించారు. ఎస్వీబీసీలో ప్రసారం చేసేందుకు వీలుగా 'వేద విజ్ఞాన తరంగిణి' పేరుతో ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో రూపొందిస్తున్న ఎపిసోడ్లను త్వరగా పూర్తి చేయాలన్నారు. సోషల్ మీడియాలో ప్రసారం చేసేందుకు ఎస్వీబీసీ రూపొందిస్తున్న 'భారతీయ వజ్ఞాన ధార' కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. టీటీడీ పరిధిలోని అన్ని ఆస్పత్రుల్లో రోగులు, సిబ్బందికి నాణ్యమైన ఆహారం అందించేందుకు క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. జేఈఓలు సదా భార్గవి, వీరబ్రహ్మం, ఎస్వీబీసీ సీఈఓ షణ్ముఖ్‌కుమార్, ఎఫ్ఏసీఏవో బాలాజీ, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వర రావు, స్విమ్స్ ఉపకులపతి డాక్టర్ వెంగమ్మ, వేదవర్సిటీ ఉపకులపతి ఆచార్య రాణి, సదాశివమూర్తి, చీఫ్ ఆడిట్ ఆఫీసర్ శేషశైలేంద్ర పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జడ్జి సత్యకాంత్‌కుమార్

తిరుపతి అర్బన్: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సత్యకాంత్‌కుమార్ తెలిపారు. తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో శనివారం విద్యా, కార్మిక శాఖల ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఆర్టికల్ 21 ప్రకారం 6 నుంచి 14 ఏళ్లలోపు పిల్లలకు ఉచిత నిర్బంధ విద్య అందించాలన్నారు. డీఈఓ వి.శేఖర్ మాట్లాడుతూ విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని సూచించారు. తిరుపతి జిల్లాలో ఉచిత నిర్బంధ విద్యాహక్కు కింద 2023–24లో 1008 సీట్లకు గాను 863 మంది విద్యార్థులను వివిధ ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించినట్టు తెలిపారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ బాలానాయక్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు నైతిక విలువలపై అవగాహన పెంచాలని సూచించారు. విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు లక్ష్మీనారాయణ, రమణారావు, అకాడమీ మానిటరింగ్ ఆఫీసర్ శివశంకర్, ఐసీడీఎస్ లీగల్ ఆఫీసర్ వెంకటేష్ పాల్గొన్నారు.

రుయాలో వృద్ధురాలి నుంచి బంగారం అపహరణ



నంజమ్మ

తిరుపతి తుడా : తిరుపతి రుయా ఆసుపత్రిలో శనివారం దొంగ వృద్ధురాలి నుంచి బంగారం అపహరించిన విషయం ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. అన్నమయ్య జిల్లా కమ్మచెరువుకు చెందిన వృద్ధుడు గంగులప్పను మంగళవారం ఆయన భార్య నంజమ్మ రుయాలోని వయోవృద్ధుల వార్డులో చేర్పించారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తి వైద్యులు వచ్చే క్రమంలో వెనుకనే వచ్చి సిబ్బందిగా నంజమ్మను నమ్మించాడు. ఆమెతో పరిచయం పెంచుకొని ఆరోగ్యశ్రీ ఉందా అని ఆరా తీశాడు. ఆరోగ్యశ్రీకి దరఖాస్తు చేసుకోలేదని ఆమె చెప్పడంతో అతను ఆరోగ్యశ్రీ ద్వారా డబ్బులు ఇప్పిస్తానని నమ్మించి ఆధార్ కార్డు తీసుకుని తనవెంట రావాలని చెప్పాడు. ఆమె ఆమె శుక్రవారం అతని వెంట వెళ్లింది. బంగారు నగలు వేసుకుని వెళితే ఆరోగ్యశ్రీ రాదని చెప్పడంతో ఆమె ఎనిమిది గ్రాముల బంగారు కమ్మలు, మాటీలను తీసి అతనికి ఇచ్చింది. ఇక్కడే ఉండు ఆధార్ జిరాక్స్ చేసుకువస్తానని చెప్పి ఆ వ్యక్తి అక్కడి నుంచి ఉడాయించాడు. కొంత సేపటికి తేరుకున్న నంజమ్మ కేకలు వేయడంతో అక్కడున్న వారు ఆమెను వయోవృద్ధుల వార్డుకు తీసుకువచ్చారు. విషయం అధికారులకు చెప్పడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదుచేశారు.

జగనన్న సురక్ష ప్రయోజనాలను ప్రతి ఇంటికీ చేర్చండి



జగనన్న సురక్షపై అవగాహన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: జగనన్న సురక్ష పథకం వల్ల కలిగే ప్రయోజనాలను, ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల వివరాలను ప్రతి ఇంటికీ చేరవేయాల్సిన బాధ్యత సచివాలయ సెక్రటరీలు, వార్డు వలంటీర్లదేనని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత తెలిపారు. ఆమె శనివారం 42వ డివిజన్ రామచంద్రానగర్‌లో జగనన్న సురక్ష కార్యక్రమ నిర్వహణను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి ధ్రువీకరణ పత్రాలు అవసరమా? లేదా? అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందడం లేదా అనే వివరాలు సేకరించాలని సూచించారు. కుల, ఆదాయం వంటి 11 రకాల ప్రభుత్వ సర్వీసులను ఉచితంగా పొందవచ్చన్న విషయం తెలియజేయాలన్నారు. ధ్రువీకరణ పత్రాలు, సంక్షేమ పథకాలకు అర్హత ఉన్నవారి నుంచి దరఖాస్తులు చేయించాలని సూచించారు. డీఎఫ్‌వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

33 కేవీ విద్యుత్ లైన్‌ను మార్చాలని ఆదేశం

తిరుపతి రూరల్: మండలంలోని అవిలాల శానప్ప కాలనీలో ఇళ్ల మీదుగా వెళుతున్న 33 కేవీ విద్యుత్ లైన్‌ను మార్చాలని జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయనను కలిసి విద్యుత్ లైన్ వల్ల జరుగుతున్న ప్రమాదాల గురించి వివరించారు. లైన్‌ను మార్చేందుకు విద్యుత్ శాఖ అధికారులు రూ.లక్షలు అడుగుతున్నారని, అందరూ పేదలని, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్‌ను మార్చాలని విన్నవించారు. పరిశీలించిన కలెక్టర్ వెంటనే లైన్ మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎస్పీడీసీఎల్ తిరుపతి సర్కిల్ ఎస్ఈ కృష్ణారెడ్డిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సీవీ రమణ, అధికారులు పాల్గొన్నారు.